ఎన్నికల బాండ్ల కేసును విచారిస్తున్న ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం

బాండ్ల నంబర్లూ ఇవ్వాల్సిందే

వివరాల వెల్లడిలో సెలెక్టివ్‌గా ఉండొద్దు

- 21లోగా పూర్తి వివరాలు వెల్లడించాలి • స్టేట్ బ్యాంక్‌కు సుప్రీంకోర్టు ఆదేశం
- వివరాలు అందిన వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఈసీకి సూచన

న్యూఢిల్లీ, మార్చి 18: ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించకపోవడంపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాండ్ల వివరాల వెల్లడిలో 'సెలెక్టివ్' విధానాన్ని మానుకోవాలని, ఈ నెల 21లోగా ఏ దాత, ఏ రాజకీయ పార్టీకి బాండ్ల రూపంలో ఎంత విరాళం ఇచ్చారనేది తెలియజేసే యునిక్ బాండ్ నంబర్లతో సహా ఈసీకి పూర్తి వివరాలు సమర్పించాల్సిందేనని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఎస్బీఐని ఆదేశించింది. ఆ తర్వాత యునిక్ నంబర్లతో సహా అన్ని వివరాలు ఇచ్చేశామని చెబుతూ ఎస్బీఐ సీఎండీ 21న సాయంత్రం 5 గంటలలోగా సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించాలని పేర్కొన్నది. ఇదే సమయంలో ఎస్బీఐ నుంచి బాండ్ల పూర్తి వివరాలు అందిన వెంటనే వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఈసీకి సూచించింది.

బాండ్ల వివరాల వెల్లడికి వ్యతిరేకంగా పిటిషన్లు

బాండ్ల వివరాల వెల్లడిని వ్యతిరేకిస్తూ అసోచామ్, సీఐఐ దాఖలు చేసిన అన్‌లిస్టెడ్ మధ్యంతర పిటిషన్లపై అత్యవసర విచారణ చేపట్టేందుకు ధర్మాసనం తిరస్కరించింది. బాండ్ల వివరాల వెల్లడిపై ఇచ్చిన తీర్పును సమీక్షించే అంశాన్ని సుమోటోగా తీసుకోవాలని కోరుతూ సీనియర్ అడ్వకేట్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు అదిశ్ సీ అగర్వాలా రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొనేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై అగర్వాలాకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ చీవాట్లు పెట్టారు. 'మీరు ఒక సీనియర్ న్యాయవాది, ఎస్‌సీబీఏ అధ్యక్షుడిగానూ ఉన్నారు. మీకు న్యాయ ప్రక్రియ తెలుసు. ఇవన్నీ పబ్లిసిటీ స్టంట్లు. ఇలాంటి వాటిని మేం అనుమతించబోం' అని పేర్కొన్నారు.

ఆల్ఫా న్యూమరిక్ నంబర్లు వెల్లడించలేదు..

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమైనవని, వాటిని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. గత ఐదేండ్లలో జారీచేసిన బాండ్ల వివరాలను ఈసీకి అందించాలని ఎస్బీఐని ఆదేశించింది. అయితే ఈసీకి అందించిన ఎస్బీఐ బాండ్ల సమాచారం అసంపూర్తిగా ఉన్నదని, ఏ వ్యక్తి/సంస్థ బాండ్లను ఏ రాజకీయ పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపే బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నంబర్లు వెల్లడించలేదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఎస్బీఐకి తాజా ఆదేశాలు ఇచ్చింది.

ఎవరి 'దశ' తిరిగేనో?

దక్షిణాదిలో పాగాకు బీజేపీ యత్నాలు
ఉత్తరాదిన ఉనికి కోల్పోయిన కాంగ్రెస్
రీజియన్ల వారీగా వేర్వేరు పరిస్థితులు

అందరి దృష్టి ఈ 10 అంశాలపైనే

న్యూఢిల్లీ, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల నగారా మోగడంతో దేశంలో రాజకీయ వేడి పెరిగింది. పొత్తులు, సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికలు, ప్రచార వ్యూహాలపై పార్టీలు ఇప్పటికే తలమునకలయ్యాయి. 'మోదీ గ్యారెంటీలు' అంటూ బీజేపీ, 'న్యాయ్ గ్యారెంటీలు' అంటూ కాంగ్రెస్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అందరి దృష్టి నెల కొన్న పది అంశాలు ఏంటో చూద్దాం..

1. దక్షిణాదిన బీజేపీ పాగా వేసేనా?

దక్షిణ రాష్ర్టాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక సహా యూటీ పుదుచ్చేరిలో మొత్తంగా 129 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. అయితే వీటిలో ప్రస్తుతం బీజేపీ చేతిలో ఉన్నవి 29 స్థానాలే. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 370 పైగా సీట్లు(ఎన్డీయే-400) సాధించాలనే లక్ష్యంతో ఉన్న బీజేపీ.. ఈ రాష్ర్టాల్లోనూ గణనీయ సంఖ్యలో ఎంపీ స్థానాలు గెలుచుకోనేందుకు పావులు కదుపుతున్నది. ప్రధాని మోదీ దక్షిణాది రాష్ర్టాల్లో వరుస పర్యటనలు చేస్తున్నారు.

2. హిందీ బెల్ట్‌లో కాంగ్రెస్ కరువు తీరేనా?

2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభావం చవిచూసింది. ఫలితంగా రెండు సార్లు వరుసగా 44, 52 ఎంపీ స్థానాలకే పరిమితమైంది. 2019 ఎన్నికల్లో మొత్తంగా 149 ఎంపీ స్థానాలు ఉండే హిందీ రాష్ర్టాలు యూపీ, బీహార్, మధ్యప్రదేశ్‌లలో ఒక్కొక్క స్థానం చొప్పున మాత్రమే గెలిచింది. ఇక రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఖాతా కూడా తెరువలేదు. ఈసారైనా కాంగ్రెస్ కరువు తీరుతుందా?.

3. యూపీలో రామమందిర ప్రభావమెంత?

లోక్‌సభ ఎన్నికల్లో కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో 80కిగానూ వరుసగా 71, 62 ఎంపీ సీట్లు చొప్పున గెలిచింది. గత ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్డీ కూటమి కొంత ప్రభావం చూపింది. అయితే ఈ సారి ఈ మూడు పార్టీలు మూడు దారుల్లో ఉన్నాయి. దీనికితోడుగా ఈసారి అయోధ్యలో సాకారమైన రామ మందిర నిర్మాణం అంశం ఎన్నికలపై ప్రభావం చూపొచ్చని, బీజేపీకి కలిసి రావొచ్చని అభిప్రాయపడుతున్నారు.

4. బీహార్‌లో 2019 సీన్ రిపీట్ అవుతుందా?

బీహార్‌లో సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ తిరిగి బీజేపీ పంచన చేరింది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీచేసి, 40కి 39 స్థానాల్లో విజయకేతనం ఎగురవేశాయి. మరోవైపు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉద్యోగాల అజెండాతో ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇది వర్కౌట్ అయితే బీజేపీ 'మిషన్ 370'పై ప్రభావం పడొచ్చు.

5. బెంగాల్, అస్సాంలో సీఏఏ ప్రభావమెంత?

బెంగాల్‌లో బీజేపీ బలంపెరుగుతున్నప్పటికీ, అది సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని అధికార టీఎంసీకి చెక్ పెట్టే అంత స్థాయిలో లేదు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 18 ఎంపీ స్థానాలు గెలువగా.. టీఎంసీ 22 గెలుచుకొన్నది. ఈసారి సందేశ్‌ఖాలి ఎపిసోడ్‌తో పాటు సీఏఏ అమలు తమకు లాభిస్తుందనే ఆశతో కమలం పార్టీ ఉన్నది. సీఏఏ వ్యతిరేక ఆందోళనలు పెద్దయెత్తున రేగిన అస్సాంలోనూ 2021 అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈసారి తాము అధిక స్థానాలు గెలుచుకొంటామని బీజేపీ చెబుతున్నది.

6. పంజాబ్ పజిల్

పంజాబ్‌లో ప్రస్తుతం ఆప్ అధికారంలో ఉన్నది. ఇక్కడ బీజేపీ కేవలం అర్బన్ హిందూ ఓట్ల బేస్‌తో బలహీనంగా ఉండగా.. కాంగ్రెస్ పార్టీ తన పట్టును కోల్పోయింది. రైతాంగ ఉద్యమం నేపథ్యంలో గ్రామీణ పంజాబ్‌లోని రైతులు బీజేపీకి మరింత దూరం జరిగారు.

7. మహారాష్ట్ర మ్యాటర్స్

మహారాష్ట్ర రాజకీయాలు గత కొన్నేండ్లుగా చీలిక పేలికలుగా మారాయి. ప్రధాన పార్టీలుగా ఉన్న కీలక నేతల తిరుగుబావుటాతో శివసేన, ఎన్సీపీ పార్టీలు నిలువునా చీలాయి. ఈ క్రమంలో ఈ రెండు పార్టీల నుంచి చీలి, అసలు పార్టీలుగా గుర్తింపు పొందిన సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ గ్రూపులు రెండూ బీజేపీ కూటమిలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి పార్టీలు లేదా వ్యక్తుల ఆధారంగా ఓటింగ్ ఉంటుందా? అనేది చూడాల్సి ఉన్నది.

8. హర్యానాలో సీఎం మార్పు

గత ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలోని 10 స్థానాలను గెలుచుకొన్నప్పటికీ, ఆ పార్టీ ఈసారి జాట్ల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో కమలం పార్టీ.. ఇటీవల సీఎంగా ఖట్టర్ స్థానంలో ఓబీసీ నేతకు పగ్గాలు అప్పగించింది. జాట్‌లు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉండే దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీ కూడా బీజేపీకి దూరమైంది.

9. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రయోగం

ఏపీలో టీడీపీ, జనసేన కూటమిలో బీజేపీ చేరింది. 25కిగానూ ఆరు ఎంపీ సీట్లలో పోటీ చేసేలా ఒప్పందం చేసుకొన్నది. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, టీడీపీ, జనసేనతో పొత్తు తమకు కొంతైనా కలిసొచ్చే అవకాశం ఉన్నదనే ఆశతో కమలం పార్టీ ఉన్నది.

10. కర్ణాటకలో సీన్ రివర్స్!

గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుచుకొని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 25 ఎంపీ సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క స్థానానికి పరిమితమైంది. రాష్ట్రంలో హస్తం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు తలనొప్పిగా మారాయి.

మహారాష్ట్రలో తెలుగు సాహిత్య అకాడమీ

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

ముంబై, మార్చి 18 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ స్థాపనకు మహారాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో మహారాష్ట్రలోని తెలుగు సాహితీవేత్తల దశాబ్దాల ఎదురుచూపులకు తెరపడింది. క్యాబినెట్ సమావేశంలో తెలుగు, బెంగాలీ, సంస్కృత సాహిత్య అకాడమీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పాటు కోసం నిరుడు ఏప్రిల్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు మంత్రి సుధీర్ మునిగంటివార్‌కు వినతిపత్రం అందించారు. మహారాష్ట్ర ప్రభుత్వం చాలా ఏండ్లుగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ తెలుగు భాషలో పాఠ్య పుస్తకాలు అందిస్తున్నది. మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పాటుపై తెలుగు ప్రముఖులు ఆనందం వ్యక్తం చేశారు.

రోజుకు 50 కోట్ల లీటర్ల నీటి కొరత

బెంగళూరు సంక్షోభంపై కర్ణాటక సీఎం

బెంగళూరు, మార్చి 18: కర్ణాటక రాజధాని బెంగళూరులో నీటి సంక్షోభం నెలకొన్నదని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సోమవారం అధికారులతో సమీక్షించిన ఆయన.. సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. బెంగళూరులో రోజుకు 2,600 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉండగా.. దాదాపు 500 ఎంఎల్‌డీ కొరత ఉందని తెలిపారు. నగరంలో ఉన్న మొత్తం 14 వేల బోరుబావుల్లో 6,900 మేర ఎండిపోయాయని పేర్కొన్నారు. జూన్‌లో ప్రారంభం కానున్న 'కావేరీ ఫైవ్ ప్రాజెక్టు' ద్వారా చాలా వరకు నీటి ఇబ్బందులు తీరుతాయని అన్నారు. బెంగళూరులో అసలు నీటి సంక్షోభమే లేదని డిప్యూటీ సీఎం శివకుమార్ ఇటీవల పేర్కొనడంపై విపక్షాలు విరుచుకుపడ్డ సంగతి తెలిసిందే.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

న్యూఢిల్లీ : ఢిల్లీ జల్ బోర్డ్(డీజేబీ)కు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సోమవారం ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. చట్ట విరుద్ధంగా ఈడీ నోటీసులు జారీచేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ ఈ సందర్భంగా మండిపడింది. ఎన్నికల్లో ప్రచారం చేయకుండా కేజ్రీవాల్‌ను కేంద్రంలోని అధికార బీజేపీ టార్గెట్ చేసిందని ఆరోపించింది. కాగా, ఆప్ నేత సత్యేందర్ జైన్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిలు పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

బెంగాల్ డీజీపీపై ఈసీ వేటు

- ఆరు రాష్ర్టాల హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శుల తొలగింపునకు ఆదేశం
- లోక్‌సభ ఎన్నికల వేళ ఈసీ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వేళ.. కేంద్ర ఎన్నికల సంఘం పెద్దయెత్తున బదిలీలు చేపట్టింది. పలు రాష్ర్టాల్లోని ఉన్నతాధికారులపై సోమవారం వేటు వేసింది. పశ్చిమబెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్‌ను విధుల నుంచి తప్పించడంతో పాటు గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ర్టాల హోంశాఖ కార్యదర్శులను తొలగించాలని ఆదేశించింది. వీరంతా ఆయా రాష్ర్టాల సీఎం కార్యాలయాల్లో రెండు రకాల విధులు నిర్వహిస్తున్నట్టు గుర్తించినట్టు ఈసీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా మిజోరం, హిమాచల్‌ప్రదేశ్ సాధారణ పరిపాలనా విభాగాల కార్యదర్శులను కూడా తొలగించాలని ఆదేశాలు జారీచేసింది. నిష్పాక్షికత, తటస్థత కోసం ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఈసీ వర్గాలు పేర్కొన్నాయి.

కొత్త డీజీపీగా వివేక్ సహాయ్

రాజీవ్ కుమార్‌ను గతంలో 2016 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా ఎన్నికల విధుల నుంచి ఎన్నికల సంఘం తప్పించింది. ఈ నేపథ్యంలోనే ఆయన్ను తాజాగా డీజీపీ బాధ్యతల నుంచి తప్పించారు. కాగా, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే రాజీవ్‌కుమార్ స్థానంలో వివేక్ సహాయ్‌ను కొత్త డీజీపీగా నియమించింది. మరోవైపు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఇక్బాల్ సాంగ్ చాహల్ సహా పలువురు అదనపు, డిప్యూటీ కమిషనర్లను తొలగించాలని ఈసీ ఆదేశాలను మహారాష్ట్ర ప్రభుత్వం పాటించలేదు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఈసీ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

బీహార్‌లో బీజేపీ 17.. జేడీయూ 16

న్యూఢిల్లీ : బీహార్‌లో ఎన్డీయే పార్టీల మధ్య సీట్ల పంపకం కొలిక్కి వచ్చింది. ఆ రాష్ట్రంలో బీజేపీ-17 స్థానాల్లో, నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) 16 స్థానాల్లో, చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన ఎల్‌జేపీ (రామ్ విలాస్) పార్టీ-5 స్థానాల్లో పోటీ చేయడానికి అంగీకారం కుదిరినట్టు బీహార్ బీజేపీ శాఖ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. హిందుస్తానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలు చెరొక స్థానంలో పోటీ చేస్తాయని తెలిపింది.

తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్

న్యూఢిల్లీ, మార్చి 18: తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ మధ్య మరో వివాదం రేగింది. మాజీ మంత్రి పొన్ముడిని తిరిగి మంత్రివర్గంలో నియమిస్తూ స్టాలిన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గవర్నర్ తిరస్కరించడంతో ప్రభుత్వం మరోసారి సుప్రీంను ఆశ్రయించింది. ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిశీలించడానికి చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం అంగీకరించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శిక్ష పడటంతో పొన్ముడిపై అనర్హత వేటు పడింది. అయితే ఆయనకు పడిన శిక్షపై ఇటీవల సుప్రీంకోర్టు స్టే విధించడంతో ఆయనను స్టాలిన్ ప్రభుత్వం తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోగా, ఆ నియామకాన్ని గవర్నర్ తిరస్కరించారు. అది రాజ్యాంగ పరంగా అనైతికతతో కూడుకున్నదని పేర్కొనడంతో ఆయన చర్యను సవాల్ చేస్తూ స్టాలిన్ ప్రభుత్వం తాజాగా సుప్రీంను ఆశ్రయించింది.

కేరళ కవి ప్రభ వర్మకు సరస్వతి సమ్మాన్

న్యూఢిల్లీ: ప్రముఖ కేరళ కవి ప్రభ వర్మకు 'సరస్వతి సమ్మాన్, 2023' పురస్కారం లభించింది. ఆయన రచించిన 'రౌద్ర సాత్వికం' నవలకు ఈ గౌరవం దక్కినట్టు కేకే బిర్లా ఫౌండేషన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, అత్యున్నత స్థాయి సాహితీ పురస్కారంగా దీనిని పరిగణిస్తారు. ఈ పురస్కారాన్ని 1991లో ఏర్పాటు చేశారు. మలయాళంలో రచించిన 'రౌద్ర సాత్వికం' నవల 2022లో ప్రచురితమైంది.

అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు..

8 మంది మృతి

బాగ్దాద్, మార్చి 18: అర్ధరాత్రి వేళ అఫ్గానిస్థాన్‌పై పాక్ సైన్యం వైమానిక దాడులకు దిగింది. పాక్టికా ప్రావిన్స్‌లోని బర్మాల్ జిల్లాలో, ఖోస్ట్ ప్రావిన్స్‌లోని సెపెరా జిల్లాలో ఈ దాడులు జరిగాయి. రెండు చోట్ల జరిగిన దాడుల్లో 8 మంది దుర్మరణం చెందారు. సాధారణ పౌరుల నివాసాలే లక్ష్యంగా సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పాక్ ఈ దాడులకు పాల్పడిందని అఫ్గాన్ అధికార ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తెలిపారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారని వెల్లడించారు.

రష్యా అధ్యక్షుడిగా మళ్లీ పుతిన్

- మరో ఆరేండ్లు అధికారం

మాస్కో, మార్చి 18: గత 24 ఏండ్లుగా రష్యా అధ్యక్షుడిగా/ప్రధానిగా అధికారంలో కొనసాగుతున్న పుతిన్ మరోసారి దేశ అధ్యక్షుడిగా విజయం సాధించారు. అసమ్మతి గళాన్ని ఉక్కుపాదంతో అణచివేసిన పుతిన్.. బలమైన ప్రత్యర్థులు లేకుండా జరిగిన ఈ ఎన్నికల్లో 87 శాతం ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో మరో ఆరేం డ్లు రష్యా పాలనా పగ్గాలు చేపట్టనున్నారు. ఈ పదవీ కాలం పూర్తయితే రష్యాను అత్యధిక కాలం పాలించిన నేతగా ఆయన రికార్డు సృష్టించనున్నారు. 1999 డిసెంబర్ నుంచి పుతిన్ రష్యా అధ్యక్షుడిగా లేదా ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ ఎన్నికలు బూటకమని పశ్చిమదేశాలు కొట్టివేశాయి. ఇవి స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగిన ఎన్నికలు కావని, కఠినంగా నియంత్రించబడిన వాతావరణంలో జరిగిన ఎన్నికలని బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి పేర్కొన్నారు. మాస్కో, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లలో ఓటేయటానికి క్యూలో నించున్న రష్యన్లలో కొంత మంది తాము నిరసనలో పాల్గొంటున్నట్టు మీడియాతో చెప్పారు. మాస్కోలోని ఓటర్ తాను మార్పును కోరుకుంటున్నాను అని.. కాకపోతే అది సాధ్యం కాదని చెప్పాడు. అందరిలాగే అతను కూడా తన పేరు, పూర్తి వివరాలు ఇవ్వటానికి జంకాడు.

అలాగైతే మూడో ప్రపంచ యుద్ధం తప్పదు

అమెరికా నేతృత్వంలోని నాటో సైనిక కూటమికి, రష్యాకు మధ్య వివాదం చెలరేగితే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. మూడో ప్రపంచ యుద్ధానికి ప్రపంచం కేవలం ఒక్క అడుగు దూరంలోనే ఉన్నదని హెచ్చరించారు. అలాంటి స్థితిని ఎవరూ కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించాక పుతిన్ మీడియాతో మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. నాటో దళాలు, రష్యా మధ్య యుద్ధం పొంచి ఉన్నదని ఇటీవల ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చేసిన కామెంట్‌కు స్పందనగా పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా ఎవరికీ భయపడదని పేర్కొన్నారు. తనకు మద్దతుగా నిలిచిన దేశ పౌరులందరికీ ధన్యవాదాలు చెప్తూ.. రష్యాను లొంగదీసుకోవడం ఎవరి వల్లా కాదని ఇప్పటికే చరిత్ర చెబుతున్నదని అన్నారు. వర్తమానంలో, భవిష్యత్తులో కూడా ఎవరూ రష్యా సంకల్పాన్ని అణచివేయలేరని స్పష్టం చేశారు. అలాగే ఇటీవలే అనుమానాస్పద స్థితిలో మరణించిన తన బద్ధ విరోధి నావల్నీ మృతిపై పుతిన్ విచారం వ్యక్తం చేశారు. ఖైదీల మార్పిడి కింద అతడిని విడుదల చేయాలనుకున్నట్టు చెప్పారు. నావల్నీని అప్పగించి, పాశ్చాత్య దేశాల్లో ఉన్న కొందరిని రష్యాకు తీసుకొద్దామని అనుకున్నట్టు పేర్కొన్నారు.

4 నెలల మనవడికి 240 కోట్ల గిఫ్ట్

- *15 లక్షల ఇన్ఫోసిస్ షేర్లు రాసిచ్చిన నారాయణమూర్తి*
- *మిలియనీర్ల జాబితాలో చేరిన ఏకాగ్రహ్ రోహన్*

న్యూఢిల్లీ, మార్చి 18: ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణ మూర్తి మరోమారు హెడ్‌లైన్స్‌లో నిలిచారు. ఆయన తన నాలుగు నెలల మనవడు ఏకాగ్రహ్ రోహన్‌మూర్తికి రూ.240 కోట్ల విలువైన షేర్లను బహుమతిగా రాసిచ్చారు. తాత పెట్టిన ఒక్క సంతకంతో రోహన్ ఇండియాలో అతి పిన్నవయస్కుడైన మిలియనీర్ల జాబితాలో చేరిపోయాడు. రోహన్ పేరిట ఇప్పుడు 15 లక్షల ఇన్ఫోసిస్ షేర్లు ఉన్నట్టు ఎక్స్‌చేంజ్ ఫైలింగ్‌ను బట్టి తెలిసింది. కంపెనీ షేర్ల శాతంలో ఇది 0.04 శాతం. మనవడికి షేర్లు గిఫ్ట్‌గా ఇవ్వడానికి ముందు ఇన్ఫోసిస్‌లో నారాయణమూర్తి షేర్ల వాటా 0.40 శాతం కాగా, ఇప్పుడు అది 0.36 శాతానికి పడిపోయింది. ఇప్పుడాయన ఖాతాలో 1.51 కోట్ల షేర్లు ఉన్నాయి. ఏకాగ్రహ్ నవంబర్ 2023లో రోహన్‌మూర్తి, అపర్ణా మూర్తికి జన్మించాడు. నారాయణ మూర్తి-సుధామూర్తి దంపతులకు ఆయన మూడో మనవడు. అక్షతా మూర్తి-యూకే ప్రధాని రిషి సునాక్ దంపతుల ఇద్దరు కుమార్తెలకు కూడా వీరే గ్రాండ్ పేరెంట్స్.

హిమాచల్ కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల అనర్హతపై స్టేకు సుప్రీం నో

- అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు, ఓటు వేసేందుకు అనుమతించరాదని ఆదేశం
- ఎమ్మెల్యేల పిటిషన్‌పై నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని స్పీకర్‌కు నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 18: ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డ ఆరుగురు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ స్పీకర్ జారీ చేసిన ఆదేశాలపై స్టే విధించడానికి సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై స్పీకర్ కుల్‌దీప్ సింగ్ పటానియా నాలుగు వారాల్లో తమ స్పందనను తెలియజేయాలని జస్టిస్‌లు సంజయ్ ఖన్నా, దీపాంకర్ దత్తా ధర్మాసనం ఆదేశించింది. అనర్హత వేటు పడ్డ ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ కార్యకలాపాల్లో పాల్గొనడానికి, ఓటు వేయడానికి అనుమతించరాదని పేర్కొంది. ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలకు ఉప ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని పిటిషనర్ల తరపు న్యాయవాది హరీశ్ సాల్వే ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఒకసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన తర్వాత కోర్టు దానిలో జోక్యం చేసుకోదని ప్రభుత్వ తరపు న్యాయవాది ఏఎం సింఘ్వీ అన్నారు. సాధారణంగా ఏదైనా వివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇరు వాదనలు విన్న తర్వాత పిటిషనర్లు వారంలోగా తమ సమాధానాన్ని దాఖలు చేయవచ్చునని పేర్కొంటూ కేసును మే 6కి వాయిదా వేసింది. కాగా, ఈ ఆరు స్థానాల ఉప ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 7 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. హిమాచల్‌లో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీకి అనుకూలంగా ఓటు వేయడంతో ఫిబ్రవరి 29న అసెంబ్లీ స్పీకర్ వారిపై అనర్హత వేటు వేశారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అనర్హతపై స్పీకర్ తమకు ఇచ్చిన నోటీస్‌పై స్పందించడానికి తగిన సమయం ఇవ్వకుండానే తమపై అనర్హత వేటు వేశారంటూ ఎమ్మెల్యేలు ఆరోపించారు.

కోల్‌కతాలో భవనం కూలి 10 మంది మృతి

కోల్‌కతా, మార్చి 18: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. గార్డెన్ రీచ్ ఏరియాలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో 10 మంది చనిపోగా, దాదాపు 20 మందికి గాయాలయ్యాయి. ఇంకా భవన శిథిలాల కింద చిక్కుకొన్న వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొన్నారు.

క్రైమ్ జీపీటీతో నేరస్థుల ఆటకట్టు!

న్యూఢిల్లీ, మార్చి 18: నేరస్థులను త్వరగా పట్టుకొనేందుకు ఉత్తరప్రదేశ్ పోలీసులు ఇప్పుడు క్రైమ్ జీపీటీ అనే సరికొత్త సాంకేతికతను వినియోగిస్తున్నారు. స్టాక్యు టెక్నాలజీస్ రూపొందించిన ఈ కొత్త టెక్నాలజీ సాధనంతో స్పెషల్ టాస్క్ ఫోర్స్.. నేరస్తులను సత్వరమే గుర్తించి లోపలేస్తున్నది. నేరస్తుల డాటాబేస్‌ను తనిఖీ చేయడం ద్వారా క్రైమ్ జీపీటీ పనిచేస్తుంది. ఇది నేరస్థుల ముఖాలను, స్వరాలను గుర్తిస్తుంది. క్రిమినల్ గ్యాంగ్ చర్యలను విశ్లేషిస్తుంది. యూపీ పోలీసుల వద్ద 9 లక్షల మంది నేరస్తుల సమాచారంతో కూడిన డాటాబేస్ ఉన్నది. క్రైమ్ జీపీటీ అనేది త్రినేత్ర అనే మరో సాధనం అప్‌గ్రేడ్ వర్షన్. నేరస్థులను కనిపెట్టడంలో ఇది సాయం చేస్తున్నది.

వన్యప్రాణులతో సెల్ఫీలు దిగితే ఏడేండ్లు జైలు!

భువనేశ్వర్: అనుమతి లేకుండా వన్యప్రాణుల ఫొటోలు కానీ, సెల్ఫీలు కానీ తీస్తున్నారా? ఏడేండ్ల జైలు తప్పదని హెచ్చరిస్తున్నారు ఒడిశా అటవీ శాఖాధికారులు. జంతువులతో ఫొటోలు ముఖ్యంగా సెల్ఫీల కారణంగా వన్యప్రాణి సంరక్షణ ప్రాంతాలలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల క్రమంలో ఒడిశా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సుశాంత్ నందా ఆదేశాలు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడానికి జంతువులతో సెల్ఫీలు తీసుకుంటున్నారని, జంతువుల సహజ ప్రవర్తన, వాటి నివాస పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని, అంతేకాకుండా ఇది 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని అతిక్రమించడమేనని అన్నారు.

అంతరిక్షంలో విలాస విందు!

లండన్, మార్చి 18: అంతరిక్షంలో విహరింపజేస్తామని, నక్షత్రాల నడుమ హాయిగా భోజనం చేయొచ్చని ఆఫర్ చేస్తున్నదో స్పేస్ టూరిజం కంపెనీ. అంతరిక్షంలో డిన్నర్ చేయించి జీవితంలో మర్చిపోలేని గొప్ప అనుభూతిని కల్పిస్తామని స్పేస్‌వీఐపీ అనే లగ్జరీ అంతరిక్ష టూరిజం సంస్థ చెప్తున్నది. నెప్ట్యూన్ అంతరిక్ష నౌకలో టూరిస్టులను భూ ఆవరణం ఆవలకు చేర్చి, డిన్నర్ చేయిస్తామని అంటున్నది. 2025 చివరి నాటికి లాంచ్ కానున్న ఈ మిషన్‌లో భాగంగా సముద్ర మట్టం నుంచి లక్ష అడుగులపైకి వెళ్లనున్నారు. మజిలీ చేరేందుకు 6 గంటల ప్రయాణం ఉంటుంది. అయితే, ఒక్కొక్కరి టికెట్ ధర కేవలం రూ.4.10 కోట్లు అని ఆ సంస్థ ప్రకటించింది.

ప్రభుత్వ పథకం లబ్ధి కోసం.. సోదరితో పెండ్లి

లక్నో, మార్చి 18: కేవలం ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో అప్పటికే పెళ్లయిన సోదరిని అందరి ముందు ఆమె సోదరుడు వివాహమాడాడు. ఉత్తరప్రదేశ్‌లో ఈ ఘటన జరిగింది. ఆర్థికంగా బలహీన వర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సామూహిక వివాహ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద పెళ్లాడిన జంటకు గృహోపకరణాలతోపాటు 35 వేల నగదును అందిస్తారు. మహరాజ్ గంజ్ జిల్లాలో ఓ వివాహితను మరోసారి పెళ్లి చేసుకోవటానికి కొంత మంది ఒప్పించారు. అయితే ముహూర్త సమయానికి వాళ్లు మాట్లాడుకున్న వరుడు రాలేదు. దీంతో ఆ వివాహిత సోదరుడితో ఆమె వివాహం జరిపించారు.

ఆఫీస్‌కు రాకపోతే ప్రమోషన్లు ఉండవ్..

న్యూఢిల్లీ, మార్చి 18: ల్యాప్‌టాప్ బ్రాండ్లలో ప్రసిద్ధిగాంచిన డెల్ సంస్థ తన ఉద్యోగులకు షాకిచ్చింది. ముఖ్యంగా సుదూర ప్రాంతాల నుంచి వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సంబంధించి గత నెలలో జారీ చేసిన మెమోలో పదోన్నతులకు సంబంధించి నూతన విధానాన్ని వెల్లడించింది. ఇక నుంచి కార్యాలయంలో విధులు నిర్వహించని ఉద్యోగులు పదోన్నతుల్లో గానీ, కంపెనీలోని తమ వర్క్ రోల్‌ను మార్చుకోవడానికి కానీ అర్హులు కారంటూ స్పష్టం చేసింది. వారు రిమోట్ విధానంలోనే ఉండాలనుకుంటే అలాగే కొనసాగవచ్చునని, వారికి ప్రమోషన్లు, జాబ్ రోల్ మార్పు ఉండదని పేర్కొంది. ఈ వివక్షపై ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

మొబైల్ పోర్టబిలిటీకి కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: సిమ్ స్వాప్ మోసాలను అరికట్టేందుకు టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్.. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ నిబంధనలను సవరించింది. దొంగతనానికి గురైన లేదా దెబ్బతిన్న సిమ్ కార్డుకు బదులుగా కొత్త సిమ్ కార్డును పొందినా, కొత్త సిమ్ కార్డును కొనుగోలు చేసినా, ఆ తేదీ నుంచి ఏడు రోజుల వరకు వేరే నెట్‌వర్క్‌కు మారకూడదు. టెలికం ఆపరేటర్లు ఈ ఏడు రోజుల్లో యూనిక్ పోర్టింగ్ కోడ్‌ను యూజర్‌కు పంపించకూడదు. జూలై 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి. వేరే నెట్‌వర్క్‌కు మారాలనుకుంటే, యూజర్ తన ప్రస్తుత టెలికం ఆపరేటర్‌కు పోర్ట్ అని మెసేజ్ పంపిస్తే, 8 అంకెల కోడ్ వస్తుంది. దాన్ని మారాలనుకుంటున్న ఆపరేటర్‌కు ఇవ్వాలి.

కుర్చీలను తినేస్తున్న బాలిక!

లండన్: బ్రిటన్‌లోని వేల్స్, బ్లాక్‌వుడ్‌లో ఉంటున్న మూడేళ్ల చిన్నారి వింటర్‌ను కుర్చీలో కూర్చోబెట్టి, బిస్కెట్లు ఇస్తే; బిస్కెట్లను వదిలేసి, కుర్చీని తినేస్తుంది. ఆమె తల్లి స్టేసీ అహెర్నే (25) పరాకుగా ఉంటే చాలు, వింటర్ రెచ్చిపోయి, గోడల ప్లాస్టర్‌ను, సోఫాల ఫోమ్‌ను, గాజు పెంకులను కరకరలాడిస్తూ ఆరగిస్తుంది. పీకా అనే అత్యంత అరుదైన వ్యాధితో వింటర్ బాధపడుతుండటమే దీనికి కారణం. దీనితో పాటు ఆటిజం కూడా ఆమెను వేధిస్తున్నది. స్టేసీ కంటి మీద రెప్ప వేయకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, తన కుమార్తెను కాపాడుకుంటున్నది. ఒకరకంగా తమ కుమార్తె ఇంటినే తినేస్తున్నదని బాలిక తల్లి తెలిపారు.